సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 19.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 207
పేజీలు: 08 వెల: రూ. 5

## చెట్లు నరకడానికి వీల్లేదు

- కేబీఆర్ పార్కు చుట్టుపక్కల చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే
- రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం చెట్లను నరికివేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కోర్టులో సవాలు

03



## టీఆర్ఎస్ జెండా పండుగ

- నెల పాటు నిర్వహణ
- టీఆర్ఎస్ చీఫ్ కవిత
- పార్టీ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

03




## భారత్ భగభగ

ప్రపంచానికే హీట్ షాక్!

### టాప్-50 హాటెస్ట్ నగరాలన్నీ ఇండియాలోనే..



- వాతావరణ చరిత్రలోనే అరుదైన ఘటన
- 46.2°Cతో యూపీలోని 'బాందా' ప్రపంచంలోనే హాటెస్ట్ ప్లేస్
- ఎండల ఎఫెక్ట్.. హీట్ మ్యాప్‌పై భారత్ రెడ్ జోన్
- భారత్‌లో ఉష్ణోగ్రతల విపరీత పెరుగుదలపై నిపుణుల హెచ్చరిక
- ఏప్రిల్‌లోనే రికార్డు స్థాయి వేడి.. భవిష్యత్తుపై ఆందోళన
- ఆఫ్రికా కాదు.. ఇప్పుడు ప్రపంచ హీట్ క్యాపిటల్ ఇండియానే!
- కాలుష్యం, ఎల్‌నినో, కాంక్రీట్ జంగిల్.. వేడి వెనుక అసలు కారణాలు
- 2050 నాటికి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మారనున్నాయా?
- పగలు-రాత్రి తేడా లేకుండా మండుతున్న భారత నగరాలు

**ముద్ర డెస్క్ :**
భూమిపై అత్యంత వేడి ప్రాంతాలంటే ఇప్పటివరకు ఆఫ్రికా ఎడారులు, మధ్యప్రాచ్య దేశాలే గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేస్తూ భారత్ కొత్త హీట్ రికార్డులను నమోదు చేసింది. ఏప్రిల్ 27న నమోదైన ఉష్ణోగ్రతలు ప్రపంచ వాతావరణ చరిత్రలోనే అరుదైన ఘటనగా నిలిచాయి. ప్రపంచంలోని టాప్–50 అత్యంత వేడి నగరాల జాబితాలో ఒక్క విదేశీ నగరం కూడా లేకుండా అన్నీ భారతదేశానికే చెందినవిగా నమోదవడం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.
ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సంస్థ AQI విడుదల చేసిన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని బాందా పట్టణం 46.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతతో ప్రపంచంలో నే అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే.. అక్కడ తెల్లవారుజామున కూడా ఉష్ణోగ్రత 34.7 డిగ్రీల కంటే దిగలేదు. దీంతో ప్రజలు మిగతా 02లో

## విపత్తులపై అప్రమత్తం

**నెక్లెస్ రోడ్‌లో వరద మాక్ డ్రిల్ పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు
- రాష్ట్రవ్యాప్తంగా వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలపై భారీ మాక్ ఎక్సర్‌సైజ్‌లు

03

## సాగుకు ఏపీ రెడీ

**ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు**



- పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్ పై అధ్యయనం
- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి
- జలధార-జలహారతి పనులకు అధిక ప్రాధాన్యత
- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

04



- టీడీపీ సానుభూతిపరులే టార్గెట్?..
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్..
- జూబ్లీహిల్స్ ఫార్ములా వర్క్ వుట్ అవుతుందా?
- టీడీపీ నుంచి కాంగ్రెస్ వైపు ఓటర్ల మళ్లింపే అసలు టార్గెట్?
- ఎన్టీఆర్ విగ్రహాలతో తెలంగాణలో రేవంత్ కొత్త పొలిటికల్ స్ట్రాటజీ
- ఓఆర్ఆర్ వద్ద 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం..
- తెలంగాణలో టీడీపీ ఖాళీని కాంగ్రెస్ భర్తీ చేస్తుందా?..
- రేవంత్ అడుగులు ఆసక్తికరం

# రేవంత్ రెడ్డి మాస్టర్ స్ట్రోక్?

### ఎన్టీఆర్ ఎమోషన్‌తో సెటిలర్ల ఓట్లపై రేవంత్ ఫోకస్?

### అమీర్‌పేట్‌లో ఎన్టీఆర్ విగ్రహం.. కాంగ్రెస్ కొత్త రాజకీయ వ్యూహమా?

**ముద్ర డెస్క్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్టించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ORR) సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.
తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు (NTR) అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమ ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం మిగతా 02లో

## ధాన్యం కొనుగోలులో బాధ్యత మరిచిన కేంద్రం

**మిల్లర్ల వద్ద నుంచి ఎఫ్‌సీఐ ఎందుకు తీసుకోలేదు..**

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

03

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి..
- ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఆందోళన వద్దు..



## ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్‌లోకే

- నిజామాబాద్ ఎంపీ అరవింద్ హాట్ కామెంట్స్
- ఈయన దగ్గర పైసలు ఎక్కడివి
- బిచ్చగాడు రేవంత్ మోదీ దగ్గర అడుక్కుంటాడు

04




## హైదరాబాద్ - ముంబై జస్ట్ 3 గంటలే

**బుల్లెట్ ట్రైన్ ఏర్పాటుకు సన్నాహాలు**

- ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేత
- మూడు రాష్ట్రాల మీదుగా 671 కి.మీ. ప్రయాణం
- ఈ కారిడార్ మార్గంలో మొత్తం 12 స్టేషన్లు
- హైదరాబాద్, పుణేలో మెయింటెనెన్స్ డిపోలు

04



*హైదరాబాద్ – ముంబై మధ్య ప్రతిష్టాత్మక బుల్లెట్ రైలు ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 14 నుండి 16 గంటలు పట్టే ఈ ప్రయాణ సమయాన్ని కేవలం 3 గంటలకు తగ్గించేలా రూపకల్పన చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల మీదుగా సాగే ఈ 760 కిలోమీటర్ల హైస్పీడ్ కారిడార్ ద్వారా ముంబై–హైదరాబాద్‌లతో పాటు పుణె, సోలాపూర్, పండరీపురం వంటి ఆధ్యాత్మిక, పారిశ్రామిక నగరాల రూపురేఖలు మారనున్నాయి. కేంద్రం 2026–27 బడ్జెట్‌లో ప్రకటించిన 7 కొత్త బుల్లెట్ కారిడార్లలో భాగంగా ఈ ప్రాజెక్టు పనుల ప్రక్రియ శరవేగంగా పుంజుకుంది.*

## మళ్లీ యుద్ధం..

**తుఫాను ముందు ప్రశాంతత**

*పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల మధ్య ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది తుఫాను ముందున్న ప్రశాంతత అనే వ్యాఖ్యతో కూడిన ఏఐ జనరేటెడ్ చిత్రాన్ని ఆయన పంచుకున్నారు. ఇరాన్‌పై మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించే అంశంపై ట్రంప్ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారనే వార్తల నేపథ్యంలో ఈ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో మళ్లీ యుద్ధం తప్పదా? అన్న అంచనాలు నెలకొన్నాయి.*




- ఇరాన్ పై వైమానిక దాడుల పునరుద్ధరణపై అమెరికా సమాలోచనలు
- శాంతి ఒప్పందం కుదరకపోతే గడ్డుకాలం తప్పదని ట్రంప్ వార్నింగ్

04

## సతీశన్ అను నేను

**కేరళంలో కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వం**




- ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారం
- పదేళ్ల తర్వాత అధికార పీఠంపై యూడీఎఫ్
- రమేష్ చెన్నితాలతో సహా 20 మంది ప్రమాణం
- హాజరైన రాహుల్, ప్రియాంకా, రేవంత్, ఖర్గే

*కేరళంలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు.*

04

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



## పెళ్లిపై తగ్గుతున్న ఆసక్తి



బ్రిటన్ టీనేజర్ల లాగే భారతదేశంలోనూ వివాహం అనేది జీవితంలో ఖచ్చితంగా దాటాల్సిన మైలురాయి కాదనే భావన పెరుగుతోంది. దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు (25%) పెళ్లి బంధానికి దూరంగా ఉండాలని కోరుకుంటున్నారు.

# భగభగ భారత్..



(మొదటి పేపజీ తరువాయి)

రాత్రిపూట కూడా ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ 46.1 డిగ్రీలతో నిప్పుల కొలిమిని తలపించింది. మహారాష్ట్రలోని అమరావతి 44.3 డిగ్రీలు నమోదు చేయగా, విదర్భ ప్రాంతంలోని అకోలా, యావత్మాల్, చంద్రపూర్ వంటి నగరాలు కూడా తీవ్ర ఉష్ణోగ్రతలతో టాప్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. మొత్తం 50 నగరాల్లో అత్యధికంగా 21 నగరాలు ఉత్తరప్రదేశ్ నుంచే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గంగా మైదాన ప్రాంతం కావడం, చెట్ల కొరత, పెరుగుతున్న నగరీకరణ కారణంగా ఈ ప్రాంతాల్లో వేడి పెరిగినట్లు నిపు ణులు చెబుతున్నారు.

ఇక ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోనూ పరిస్థితి దారుణంగానే ఉంది. నోయిడా, గుర్గావ్, ఢిల్లీ నగరాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నగరాల్లో కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు, పచ్చదనం లేకపోవడం వల్ల పగటి వేడి రాత్రి పూట కూడా బయటకు వెళ్లక "హీట్ ఐలాండ్" పరిస్థితులు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులు భవిష్యత్తుపై భయాందోళనలు పెంచుతున్నాయి. 2050 నాటికి భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మనుషులు నివసించలేని స్థాయికి చేరుకునే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం, అడవుల నరికివేత, గ్లోబల్ వార్మింగ్, ఎల్నినో ప్రభావం కలిసి దేశాన్ని కుంపటిగా మారుస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రపంచంలోని టాప్-100 కాలుష్య నగరాల్లో 66 నగరాలు భారత్‌లోనే ఉండటం మరో ఆందోళనకర అంశం. ఘజియాబాద్‌లోని ప్రపంచంలోనే అత్యంత కాలుష్య ప్రాంతంగా నమోదైంది. ఉష్ణోగ్రతలు, కాలుష్యం, నీటి కొరత కలిసి భవిష్యత్తులో భారత్‌కు అతి పెద్ద సవాలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రేవంత్ రెడ్డి 'మాస్టర్ స్ట్రోక్'?



(మొదటి పేజీ తరువాయి)

పడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలు విస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్ద సీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు తాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటే నిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక రాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.

తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగా పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. ఈ వ్యూహం అమలులో భాగంగా అమీర్‌పేట్ లో విగ్రహం ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయని, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' ప్రతిపాదించిన 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

## వ్యూహాత్మక భాగస్వామ్యంతో కొత్త అధ్యాయం

### భారత్-స్వీడన్ సంబంధాలు బలోపేతం



**ముద్ర డెస్క్ :**

భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వీడన్ పర్యటన భారత్-యూరప్ సంబంధాల్లో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. గోథెన్‌బర్గ్‌లో జరిగిన ఉన్నత స్థాయి చర్చలు రెండు దేశాల మధ్య సహకారాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఎత్తి, భవిష్యత్‌కు బలమైన రోడ్‌మ్యాప్‌ను అందించాయి. ఇది కేవలం ద్వైపాక్షిక బంధాల విస్తరణ మాత్రమే కాదు, సాధారణ జనాభా, ఆవిష్కరణలు, స్థిరత్వం, అభివృద్ధి వంటి విలువలపై ఆధారపడిన భాగస్వామ్యం.

**వ్యూహాత్మక భాగస్వామ్యం..**

భారత్, స్వీడన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఉన్నతీకరించడం ఈ పర్యటనలోని అతి ముఖ్య నిర్ణయం. ఈ అప్‌గ్రేడ్ ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, రక్షణ, వాతావరణం, ప్రజల మధ్య సంబంధాలు అన్ని రంగాల్లోనూ సమగ్ర సహకారం ఏర్పడనుంది. ఈ లక్ష్యంతో ఇండియా-స్వీడన్ జాయింట్ యాక్షన్ ప్లాన్ 2026-2030ను కూడా అనుమోదించారు. ఇది రాబోయే ఐదేళ్లలో భాగస్వామ్యాన్ని ఆచరణాత్మకంగా అమలు చేసే దిశగా బలమైన ఆధారం అవుతుంది.

సాంకేతికత ఆవిష్కరణల్లో కీలక అడుగులు..
సాంకేతిక రంగం ఈ సమ్మేళనం రెండు దేశాలు జాయింట్ ఇన్నోవేషన్ పార్ట్‌నర్‌షిప్ 2.0ను అధికారికంగా ప్రారంభించాయి. దీని కింద ఇండియా-స్వీడన్ జాయింట్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా, ఇండియా-స్వీడన్ టెక్నాలజీ - ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కారిడార్ ఏర్పాటు చేయడం ఈ పర్యటనలోని మరో కీలక ప్రకటన. ఈ కారిడార్ ద్వారా ఏఐ, 6జీ, క్వాంటం కంప్యూటింగ్, లైఫ్ సైన్సెస్ వంటి అత్యాధునిక రంగాల్లో సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌ల మధ్య సహకారం, వ్యాపార అవకాశాలు పెరగనున్నాయి. ఇది భారత డిజిటల్ ఇండియా లక్ష్యాలను స్వీడన్ యొక్క పారిశ్రామిక ఆవిష్కరణలతో మేళవించి భవిష్యత్ సాంకేతికతలకు కొత్త మార్గాలు వెలికితీస్తుంది.

**వాణిజ్య, ఆర్థిక సహకారం..**

గత సంవత్సరం భారత్-స్వీడన్ ద్వైపాక్షిక వాణిజ్యం 7.75 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రాబోయే ఐదేళ్లలో వాణిజ్యం, పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ ఈ లక్ష్యం కంటే ముందే సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ట్రాన్సిషన్, డిఫెన్స్, స్పేస్, స్టార్టప్‌లు, రెసిలియెంట్ సప్లై చైన్స్ రంగాల్లో సహకారం ఈ లక్ష్యాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రధాని మోదీ యూరపియన్ బిజినెస్ నాయకులతో జరిపిన సమావేశాల్లో భారత్‌ను విశ్వసనీయ పెట్టుబడి గమ్యస్థానంగా ప్రచారం చేయడం పర్యటనలో మరో ముఖ్యాంశం.

**మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు..**

సాంస్కృతిక మేళవింపు పర్యటన సమయంలో స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌తో పాటు స్వీడన్ ప్రభుత్వం, ప్రజలు చూపిన ఆప్యాయతకు ప్రధాని మోదీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీడన్ రాజకుటుంబం ప్రధాని మోదీని రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్తో సత్కరించడం విశేషం. రవీంద్రనాథ్ ఠాగూర్ కవితల ఫ్యాక్సిమైల్‌ను బహుమతిగా అందజేయడం రెండు దేశాల మధ్య సాంస్కతిక వారసత్వ సంబంధాలను మరింత బలపరిచింది.

ప్రధాని మోదీ స్వీడన్ పర్యటన భారత్-స్వీడన్ సంబంధాలకు కేవలం ఒక దశ మాత్రమే కాదు, ఒక కొత్త యుగానికి నాంది పలికింది. ఆవిష్కరణ, స్థిరత్వం, పరస్పర లాభదాయక సహకారంపై ఆధారపడిన ఈ భాగస్వామ్యం రెండు దేశాల ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంతోపాటు, ప్రపంచ స్థాయిలో స్థిరత్వం, ఆవిష్కరణలకు కొత్త మార్గాలు చూపించనుంది.

# రష్యన్ ఆయిల్‌కు బ్రేక్.. మళ్లీ పెట్రో మంట!



**ముద్ర డెస్క్ :**

రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసే ముడిచమురుకు అమెరికా ఇచ్చిన మినహాయింపు ఆదివారం ముగిసింది. మరోవైపు ఇరాన్ - అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. హోర్ముజ్‌లో ప్రమాదకర పరిస్థితులు కొనసాగుతున్నాయి. రష్యన్ ఆయిల్ గత కాలంలో భారత ఇంధన అవసరాలకు తగినంత సరఫరా అందించింది. ఇప్పుడు దిగుమతి ఆగిపోవడంతో జాతీయ ఇంధన మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

**పునరుద్ధరించకపోతే..**

రష్యన్ ఆయిల్ దిగుమతి పునరుద్ధరణ చేయకుంటే రాబోయే రోజుల్లో మరింత ఇబ్బందులు తప్పవని విశ్లేషకులు భావిస్తున్నారు. మనకు రోజుకు సుమారు 2.3 మిలియన్ల బ్యారెల్ల మేర న్యూట్ సప్లయ్ లో తేడా ఏర్పడే అవకాశముంది. విదేశీ మార్కెట్లలో ప్రత్యామ్నాయ సరఫరా సంపాదించడం తక్షణంలో సులభం కాదు.

**పెరుగుతున్న క్రూడ్ ధరలు..**

అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఉన్న స్థితిలో చమురు ధరలు పెరిగాయి. యూఏఈలోని అను విద్యుత్ కేంద్రంపై డ్రైన్ దాడి జరగడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. మరోవైపు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు వార్నింగ్ ఇచ్చాడు. కొత్తగా ఐదు షరతులను ప్రతిపాదించాడు. ఈ షరతులను ఇరాన్ తిరస్కరించింది. నేనే పద్యంలో చమరుదరులు మరింత పెరుగుతాయన్న సంకేతాలు వస్తున్నాయి.

**భారత్ పై ప్రభావం..**

రష్యా ఆయిల్ దిగు మరి నిలిచిపోవడం, హర్మజ్ దిగ్బంధం కొనసాగుతుండడంతో సమర్ధరణం మళ్లీ పెరిగే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే చమరుద్ధరణ కేంద్రం పెంచింది. కమర్షియల్ గ్యాస్ ధర కూడా పెరిగింది. త్వరలో గృహవినియోగ గ్యాస్ ధరను కూడా పెంచే అవకాశం ఉంది. ఈ నెలాఖరు వరకు మళ్లీ ఆయిల్ ధరలను పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా లేదా లేటిన్ అమెరికా మార్కెట్లతో తాత్కాలిక ఒప్పందాలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అంతర్గత రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచడం, నౌకల మార్గాల భద్రతపై ఎక్కువ పెట్టుబడులు పెట్టడం దీర్ఘకాలిక పరిష్కారంగా పనిచేస్తుందని పేర్కొంటున్నారు.

రష్యన్ మినహాయింపుల ముగింపుతో భారత ఇంధన సరఫరాలో తాత్కాలిక ఆందోళన కలగవచ్చు. వెంటనే ప్రత్యామ్నాయ సరఫరా సమాధానం లేదా స్ట్రాటజిక్ నిల్వలు ఉపయోగించకపోతే, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల జరగే అవకాశం ఎక్కువ. దీర్ఘకాలికంగా, దేశం సరఫరా భాగస్వామ్యాల వైవిధ్యాన్ని పెంచటం, రిఫైనింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచటం, సముద్ర మార్గ భద్రతపై పెట్టుబడులు పెంచటం అత్యవసర చర్యలుగా కనిపిస్తున్నాయి.

# బండి సంజయ్‌పై చర్యలు ఉండవు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మైనర్ బాలికపై లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటోన్న బండి భగీరథ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ తప్పేమీ లేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీపై తీవ్ర అసత్య ప్రచారం జరుగుతోందని రాంచందర్‌రావు మండిపడ్డారు. ఒక వ్యక్తిని, అతడి కుటుంబాన్ని టార్గెట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీపై, బండి సంజయ్.. బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని విరుచుకుపడ్డారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి.. రాష్ట్రం మొత్తం పోస్టర్లు వేయించారని ఆరోపించారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని.. ఆయనపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోదని తేల్చి చెప్పారు. ఇక బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఏదైనా తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బండి సంజయ్‌పై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మహిళలపై నేరాల శాతం 67 శాతం పెరిగిందని గుర్తు చేసిన రాంచందర్ రావు.. జూబ్లీహిల్స్ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన కేసులో కేసీఆర్ గానీ, కేటీఆర్ గానీ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా అని నిలదీశారు. ఇక తనను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళా సర్పంచి ఫిర్యాదు చేస్తే.. ఆ పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నైతిక విలువలు లేవని.. వారి ఇంట్లో ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదని ఈ సందర్భంగా రాంచందర్ రావు నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం రాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫార్ములా ఈ-కార్ రేస్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసిపోయాయి కాబట్టే కేటీఆర్, కేసీఆర్‌లను అరెస్ట్ చేయడం లేదని విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఆయన కుటుంబంపై వస్తున్న ఆరోపణల వెనుక బీఆర్ఎస్ పార్టీ కుట్ర ఉందని మండిపడ్డారు. బండి సంజయ్, ఆయన కుమారుడికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీకి వేరే పని లేనట్టు ఉందని ఆరోపించారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని.. ఒకవేళ తప్పు చేస్తే కచ్చితంగా పార్టీ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

**అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి**
**పర్యాటక గైడ్‌లకు ప్రత్యేక శిక్షణ.. నియామకాలు**
**రూ. 5 కోట్లు కేటాయిస్తామని వెల్లడి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మ్యూజియాలు మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్‌లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు.

రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



**తరాల ఆలోచనల్లో మార్పు:** మిలియనియల్స్ నుంచి జెన్-జీ, జెన్-ఆల్ఫా వరకు పెళ్లిని ఒక సామాజిక విధిగా కాకుండా




వ్యక్తిగత ఇష్టంగా భావిస్తున్నారు. సాంప్రదాయ కుటుంబ వ్యవస్థల కంటే వ్యక్తిగత స్వేచ్ఛకు ఈ తరాలు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి.

## విపత్తులపై ప్రజా ప్రభుత్వం అప్రమత్తం

### వరద మాక్ డ్రిల్ ను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం కీలకమని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ వరద మాక్ డ్రిల్‌ను మంత్రి పరిశీలించారు. విపత్తుల సమయంలో తొలి గంట అత్యంత కీలకమని, ఆ సమయంలో తీసుకునే చర్యలే ప్రాణాలను కాపాడగలవని తెలిపారు. అగ్నిప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయని, పట్టణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.మాక్ డ్రిల్‌లో గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు.రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇవన్నీ ముందస్తు సన్నద్ధతలో భాగంగానే నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ మాక్ డ్రిల్‌లో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు. మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్, పై భాగంలో ఉండే జెండా గద్దెకు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లిస్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## గోవుల అక్రమ తరలింపును అడ్డుకోండి

### డీజీపీ కి రాజాసింగ్ లేఖ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 16న రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని, దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకేవిధంగా చూడాలన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు, రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పనిచేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం, అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

## చెరువులు, కుంటలను సంరక్షించాలి

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి జగిత్యాల-గొల్లపల్లి ప్రధాన రహదారిపై ధర్నా



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల పరిసర ప్రాంతాల్లోని చెరువులో కుంటలు వాటికి అనుబంధంగా ఉండే కాలువలను కబ్జాదారుల నుంచి సంరక్షించాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల–గొల్లపల్లి ప్రధాన రహదారిపై సోమవారం BRS పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టి ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల పట్టణ శివారులోని తిమ్మాపూర్, రఘురాముల కోట, ముప్పాళ్ళ చెరువు నీటి వనరుల చేరికకు అడ్డుగా ఉన్న ఓ్రెలు, చెరువుల అక్రమణాల మట్టి తొలగింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ కామ ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా కలిసి కబ్జాదారుల చరణ నుండి చెరువులో కాలువలను కాపాడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ ఆందోళనలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావసంత సురేష్, ఇతర టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష




**ముద్ర, కరీంనగర్ :** ధాన్యం కొనుగోళ్లు వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, లారీ యజమానుల సంఘాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 1.58 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తైందన్నారు. మిగిలిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలించాలని సూచించారు. రైతులకు ఇప్పటివరకు రూ.237.39 కోట్లు బ్యాంకుల ద్వారా చెల్లించామని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత లేకుండా చూడాలని, లారీల సంఖ్య పెంచాలని మంత్రి సూచించారు. మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగంగా పూర్తి చేయకపోవడం వల్ల రవాణా సమస్యలు వస్తున్నాయని అన్నారు. రోజుకు 150 లారీలు సిద్ధంగా ఉన్నప్పటికీ మిల్లుల్లో రెండు రోజుల పాటు లారీలు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.గ్రామాల్లో స్థానిక హమాలీలను వినియోగించుకోవాలని, ఐకేపీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు రాకుండా పోలీసులు, రవాణా శాఖ, లారీ సంఘాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ విభాగాల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్రం బాధ్యత మరిచింది

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ముద్ర, ధర్మారం:** ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం బాధ్యత మరిచిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించిన మంత్రి, కొనుగోలు ప్రక్రియ, రైతులకు చెల్లింపుల పరిస్థితిని పరిశీలించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.గత మూడు పంటల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్ల వద్ద నిల్వ ఉంచిందని, అయితే ఎఫ్ సీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం బియ్యం సేకరించకపోవడంతో రైస్ మిల్లుల్లో భారీగా నిల్వలు పేరుకుపోయాయని మంత్రి తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి కేంద్రానికి రాష్ట్ర పరిస్థితిని వివరించాల్సిందిపోయి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మిల్లర్లు ఏబీ గ్రేడ్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, కోతలు విధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం మల్లాపూర్ నుంచి కీచులాటపల్లి వరకు రూ.11.21 కోట్లతో నిర్మిస్తున్న 8 కిలోమీటర్ల నూతన రహదారి పనులను మంత్రి పరిశీలించారు. ఈ రహదారి ద్వారా ధర్మారం, పెగడపల్లి మండలాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు భూముల విలువలు కూడా పెరుగుతాయని తెలిపారు.

## పుష్కర పనులను పరిశీలించిన కలెక్టర్



**ముద్ర, మహదేవపూర్:** మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతీ నది అంత్య పుష్కరాల ఏర్పాట్లను భూపాల్‌పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పి సిరి శెట్టి సంకీర్తనతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రధాన ఘాట్‌ను పరిశీలించి భక్తుల సౌకర్యార్థం గోదావరి నదిలో క్వయర్ మ్యాట్ లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి. పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. భక్తులు గందరగోళానికి గురికాకుండా తగిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ప్రధాన ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారిపై నిరంతరం నీటిని చల్లుతూ ఉండాలని ఆదేశించారు. సరస్వతీ ఘాట్ వద్ద భక్తులు బట్టలు మార్చుకునే గదులు, షవర్ ట్యాప్స్ వంటి సదుపాయాలను పరిశీలించారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రతి 50 మీటర్లకు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. అలాగే స్టాల్స్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని, టెంట్ సిటీ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్ సమయం తక్కువగా ఉన్నందున ముఖ్యమైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రతి విగ్రహం వద్ద పూర్తి సమాచారాన్ని ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్డిఓ లు హరికృష్ణ, రవీందర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, విద్యుత్తు, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### భక్తులను రంజింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు



సరస్వతీ నది పుష్కరాల సమయంలో భక్తులను రంజింపజేసేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతిరోజు ప్రముఖ కళాకారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు భక్తులను ఆకట్టుకునే విధంగా సంగీత, నృత్య, జానపదాల వంటి కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఆయనతోపాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యాలయ పరిపాలన అధికారి విజయ్, భూపాలపల్లి టీఎస్సెస్ కళాకారుడు మైసా శంకరయ్య పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్కు చుట్టూ..
## చెట్ల నరికివేతకు 'సుప్రీం' స్టే



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌కు ఊపిరితిత్తులుగా భావించే కాసు బ్రహ్మానందరెడ్డి నేసనల్ పార్క్ చుట్టుపక్కల చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సోమవారం కీలక స్టే విధించింది. రోడ్డు విస్తరణ పనుల కోసం చెట్లను తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పార్కు చుట్టూ 25 నుంచి 35 మీటర్ల పరిధిలో ఉన్న పర్యావరణ సున్నిత ప్రాంతంలో ఎలాంటి చెట్లను నరకరాదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వ్యూహాత్మక రహదారి అభివృద్ధి ప్రణాళిక పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.పర్యావరణ కార్యకర్త కాజల్ మహేశ్వరీ దాఖలు చేసిన పిటిషన్‌లో, కేబీఆర్ పార్కు చుట్టూ ప్రతిపాదించిన రక్షిత పరిధిని రహదారి పనుల కోసం అన్యాయంగా తగ్గించారన్నారు. బఫర్ జోన్ తగ్గింపుతో కాలుష్యం, శబ్ద ప్రభావం పెరిగి పార్కు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాదించారు. దాదాపు 19 వేల మంది ప్రజలు అభ్యంతరాలు తెలిపినా వాటిని పట్టించుకోలేదని, ప్రజాభిప్రాయ సేకరణ కూడా సక్రమంగా నిర్వహించలేదని పిటిషన్‌లో ఆరోపించారు. తెలంగాణ హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్న సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చెట్ల నరికివేతపై నిలుపుదల కొనసాగుతుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది.

## సింపుల్ ఈ-గవర్నేన్స్ తో మెరుగైన సేవలు




**ముద్ర, హైదరాబాద్ :** ప్రజలకు సులభతరంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఈ–గవర్నెన్స్ విధానాలను మరింత మెరుగుపరచాలని కేంద్ర కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టీవీ సోమనాథన్ రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలకు సూచించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తమిళనాడు అమలు చేస్తున్న SimpleGov విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అధ్యయనం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎస్ కె. రామకృష్ణారావు రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ–గవర్నెన్స్ సేవలను వివరించారు. మున్సిపల్, రెవెన్యూ, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్ తదితర శాఖల్లో ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఈ–గవర్నెన్స్ విధానాన్ని కేంద్ర కేబినెట్ సెక్రెటరీ అభినందించారు.

## కోమటిరెడ్డిని సీఎం చేయాలి

### నిజామాబాద్ ఎంపీ అర్వింద్



**ముద్ర, నిజామాబాద్ :** రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ సీఎంగా నియమించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడు తున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని, ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ చురకలు అంటించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం జిల్లాకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికావని చెప్పారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు కేవలం రూ.10 కోట్ల నిధులు మాత్రమే యూడీసీకి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం ప్రకటించారంటే ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



### జెన్ ఆల్ఫా నే భారత్ కు బలం

భారతదేశ మొత్తం జనాభాలో 2010 తర్వాత జన్మించిన 'జెన్-ఆల్ఫా' తరానికి చెందినవారే 25 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. భవిష్యత్తు భారత సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చడంలో ఈ తరం కీలక పాత్ర పోషించబోతోంది.



# యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గర్వకారణం కావాలి

**యువజన–క్రీడా వారోత్సవాలకు ఘన ఆరంభం**
**ఎల్‌బీ స్టేడియంలో జుంబా, వాకథాన్, యోగా కార్యక్రమాల్లో యువత ఉత్సాహం**






**ముద్ర, హైదరాబాద్:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన–క్రీడా వారోత్సవాలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. మే 18 నుంచి 23 వరకు కొనసాగనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో జుంబా, 5 కిలోమీటర్ల వాకథాన్, యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, అర్జున అవార్డు గ్రహీతలు, యువ అథ్లెట్లు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముందుగా నిర్వహించిన మెగా జుంబా కార్యక్రమంలో మంత్రులు యువతతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం 5 కిలోమీటర్ల వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఎల్‌బీ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ వాకథాన్ బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం, బూరుగుల రామకృష్ణారావు భవన్, ఈగల్ సర్కిల్, ఆర్‌బీఐ, అసెంబ్లీ, కంట్రోల్ రూమ్ మీదుగా ఎల్‌బీ ఇండోర్ స్టేడియానికి చేరుకుంది. అనంతరం యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ యువత శక్తి దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు కనీసం రెండు గంటలు మైదానంలో గడపాలని పిలుపునిచ్చారు. "ఓడిపోతే మళ్లీ గెలవాలనే ధైర్యం నేర్పేది క్రీడలే" అని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకు మానసికంగా కుంగిపోకుండా క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచిం చారు. భారతదేశం వంటి భారీ జనాభా కలిగిన దేశానికి ఒలింపిక్స్‌లో రావాల్సినన్ని పతకాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి, తెలంగాణ యువతలో అపార ప్రతిభ ఉందన్నారు. సరైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువజన–క్రీడా వారోత్సవాలు యువత ప్రతిభను చాటుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, పారా క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్ టు ముంబై జస్ట్ 3 గంటలే

**- హైదరాబాద్-ముంబై మధ్య బుల్లెట్ ట్రైన్**
**- రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేత**



**ముద్ర డెస్క్ :** ముంబై – హైదరాబాద్ మధ్య నడిచే ప్రతిష్టాత్మక బుల్లెట్ రైలు ప్రాజెక్టు రూట్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు మహారాష్ట్రలోని పండరీపురం, సోలాపూర్ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ఈ హైస్పీడ్ రైలు ద్వారా ముంబై నుంచి పుణెకు కేవలం 50 నిమిషాల్లో ప్రయాణించ వచ్చునని సమాచారం.ముంబై– హైదరాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ సుమారు 760 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంటుంది. ఈ మార్గంలో ప్రతిపాదించబడిన ప్రధాన స్టేషన్లలో ముంబై, నవీ ముంబై, లోనావాలా, పూణె, దౌండ్, అక్లూజ్, పండరీపురం, సోలాపూర్, కలబురగి, జహీరాబాద్, హైదరాబాద్ ఉన్నాయి.ఈ ప్రాజెక్ట్ ముంబై, హైదరాబాద్ నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించనుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య రోడ్డు, రైలు మార్గాల ద్వారా ప్రయాణం 14 నుంచి 16గంటల సమయం పడుతుంది. హైస్పీడ్ రైలు మార్గం పూర్తయితే ముంబై నుంచి హైదరాబాద్ నగరానికి కేవలం మూడు గంటల్లో చేరుకోవచ్చు. ముంబై నుంచి పుణెకు ప్రయాణం కేవలం 48 నిమిషాల్లోనే పూర్తవుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా తెలిపారు.

ముఖ్యంగా, భక్తులకు పుణ్యక్షేత్రమైన పండరీపురంకు ఈ ప్రాజెక్టు వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ బుల్లెట్ రైలు పండరీపురం, సోలాపూర్ ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాల సందర్శనకు, పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు పరిశ్రమ, వాణిజ్య, ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు కొత్త బుల్లెట్ రైలు కారిడార్లను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. వీటిలో ముంబై–పుణె, పుణె–హైదరాబాద్ మార్గాలు కూడా ఉన్నాయి. దీంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికల ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఇదిలాఉంటే .. ముంబై – హైదరాబాద్ బుల్లెట్ రైలుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా మహారాష్ట్ర, తెలంగాణల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరిచి తద్వారా ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

## బండి భగీరథ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

**నిందితుడి పది మంది స్నేహితులను విచారించిన సిట్**
**స్నేహితుల ప్రమేయంపైనా ఆరా**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మరిన్ని ఆధారాలను సేకరించేందుకు సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలోనే కేసులో కీలక విషయాలను తెలుసుకునేందుకు సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. బండి భగీరథ్ పోక్సో కేసును బయటికి రాకుండా ఉండేందుకు, అతడిని కాపాడేందుకు ప్రయత్నాలు చేసినట్లు భావిస్తున్న 10 మంది ఫ్రెండ్స్‌ను సోమవారం సిట్ అధికారులు విచారణ జరిపారు.ఈ పోక్సో కేసులో బండి భగీరథ్ మాత్రమే కాకుండా.. అతడి స్నేహితుల ప్రమేయంపైనా పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. బాధిత బాలికపై అఘాయిత్యం జరిగినప్పుడు.. బండి భగీరథ్ ఫ్రెండ్స్ కూడా అక్కడే ఉన్నారని.. ఈ ఘటన తర్వాత దాన్ని బయటికి రాకుండా చేసేందుకు వారు తీవ్ర ప్రయత్నాలు చేశారని బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడంతో.. వారిని విచారణ చేశారు. ఈ ఘటన మొత్తాన్ని బయటికి రాకుండా రాజీ కుదిర్చాలని ప్రయత్నించారని.. ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసేందుకు తీవ్రంగా యత్నించారని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే బండి భగీరథ్‌తో సంబంధం ఉన్న 10 మంది ఫ్రెండ్స్ పేర్లను కూడా బాధితురాలి తల్లి పోలీసులకు అందించారు. ఈ నేపథ్యంలోనే బాధితురాలి తల్లి ఇచ్చిన పేర్ల ఆధారంగా సిట్ చీఫ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆమె ఇచ్చిన వివరాల ఆధారంగా 10 మంది బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను ఇవాళ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. వారి నుంచి విషయాలను రాబట్టేందుకు విచారణ జరిపారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో.. బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను సిట్ అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఆ సంఘటన జరిగిన రోజు అసలు ఏం జరిగింది.. ఆ సమయంలో బాధితురాలు ఏం చెప్పింది.. దానికి బండి భగీరథ్ ఎలా స్పందించాడు.. ఈ విషయంలో రాజీ చేయాలని ఎవరెవరు ఒత్తిడి తీసుకువచ్చారు.. అనే కోణంలో ప్రశ్నలు వేసి.. బండి భగీరథ్ స్నేహితుల నుంచి సమాధానాలను రాబట్టారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా వారి స్టేట్‌మెంట్‌ను అధికారికంగా రికార్డ్ చేశారు. ఈ క్రమంలోనే వారి సెల్ ఫోన్లలో ఉన్న కాల్‌డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్ హిస్టరీలను కూడా సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ 10 మంది ఇచ్చిన వివరాల ఆధారంగా.. ఈ కేసులో మరింత మందిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**గిరిజన వారసత్వ పరిరక్షణకు**
## తెలంగాణ కట్టుబాటు



**ముద్ర హైదరాబాద్:** హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్., ఐఏఎస్ నెహ్రూ శతజయంతి ట్రైబల్ మ్యూజియంలో కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, వీరుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడంలో మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వచ్చే నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# సాగుకు ఏపీ రెడీ

**ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు**
**పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్ పై అధ్యయనం**
**2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి**
**జలధార-జలహరతి పనులకు అధిక ప్రాధాన్యత**
**సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటి విడుదల**
**ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత**
**జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం**



**ముద్ర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టులకు వేగం పెంచేందుకు సీఎం చంద్రబాబునాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణాలు, శంకుస్థాపనలు నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ప్రకటించిన 25 ప్రాజెక్టులకు తోడు మరో 11 ప్రాజెక్టులను ప్రాధాన్యత జాబితాలో చేర్చాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టుపై జరిగిన సమీక్షలో సివిల్ పనులు 88 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల పునరావాసం పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే పోలవరం ఎడమ కాలువ నుంచి మేఘాద్రిగడ్డ, అక్కడి నుంచి వంశధార–నాగావళి–చంపావతి వరకు నీరు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మేఘాద్రిగడ్డ–చంపావతి లింక్‌పై అధ్యయనం చేయాలని కూడా ఆదేశించారు. వెలిగొండ, హంద్రీ–నీవా, చింతలపూడి వంటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యం కాకుండా కాలువలకు ముందుగానే నీరు విడుదల చేయాలని జలవనరుల శాఖకు సూచించారు. జలధార–జలహరతి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన లిఫ్ట్ స్కీంల పునరుద్ధరణపై కూడా సీఎం దృష్టి సారించారు. ప్రస్తుతం పనిచేయని లిఫ్ట్ స్కీంలను గాడిలో పెట్టి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఉద్యోగుల శిక్షణ ఖర్చు కాదు.. పెట్టుబడి

**- డా. రామేశ్వర్ రావు**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ESCI)లో కేంద్ర ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డా. జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ, ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ప్రభుత్వానికి పెట్టుబడిలాంటిదే గానీ, వృథా ఖర్చు కాదన్నారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద దేశవ్యాప్తంగా 2,500 మంది డిస్కంల మిడిల్ లెవల్ ఇంజినీర్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పవర్ క్వాలిటీ, సైబర్ సెక్యూరిటీ, ఫైర్ సేఫ్టీ, డ్యామ్ సేఫ్టీ వంటి అంశాలపై నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఎంపీపీడబ్ల్యూడీ ఇంజినీర్లకు కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది ఇంజినీర్లు పాల్గొన్నారు.

## సతీశన్ అను నేను..

**కేరళంలో కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వం - ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారం**

**ముద్ర డెస్క్ :** కేరళ ముఖ్యమంత్రి గా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 20మంది మంత్రులు ప్రమాణం చేశారు. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది.

## ఎమ్మెల్యే సంజయ్ ముమ్మాటికీ బీఆర్ ఎస్ కే వెళ్తాడు

**నిజామాబాద్ ఎంపీ అరవింద్ హాట్ కామెంట్స్...**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నెంబర్ వన్ ఫాల్తూ అని, సంజయ్ ముమ్మాటికి మళ్ళీ టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్తాడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాలలోని జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి పై హాట్ కామెంట్స్ ఎంపీ రెచ్చిపోయారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం కు కనెక్టివిటీ, ఎక్సెబిలిటీ ఉండాలనే జగిత్యాల రూరల్ మండలం చల్గల్ లో ప్రపోజల్ పెట్టినామన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బిఆర్ఎస్ ను ఎందుకు వదిలినావని, పార్టీ ఎందుకు మారావని, కాంగ్రెస్ లో చేరి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటిదని ఆయన ప్రశ్నించారు. బిడ్డ నిన్ను రాజకీయం గా నగ్నంగా చేసే వరకూ వదిలిపెట్టనని హెచ్చరించారు. దేశంలో అన్ని ప్రాంతాలలో కేంద్రీయ విద్యాలయం కు 5-10 ఎకరాలు కేటాయించబడిందని, కాని జగిత్యాలలో మాత్రం రెండు ఎకరాలు ఇప్పించాడని, ఇది రిజక్ట్ అయితది అని తెలుసని, అందుకే ఈ ప్రతిపదన పెట్టిండని ఎమ్మెల్యే పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. డే స్కాలర్ స్కూల్ పిల్లలు, పోషకులు రెండు సార్లు వచ్చి వెళ్లాల్సి ఉంటదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు స్థలం రాకముందు టెండర్, బడ్జెట్ ఏలా ఫైనల్ అయింది ప్రజలు ఆలోచన చెయ్యాలన్నారు. బిచ్చగాడు సీఎం రేవంత్ మోదీ దగ్గర ఆడుకుంటాడని, వీని దగ్గర పైసలు ఎక్కడివని ఎద్దేవ చేశారు. బుల్లెట్ ట్రైన్ లకు 2021 లో ఫైనల్ రిపోర్ట్ వచ్చిందని, మోడీ తెలంగాణ కు 3 కారిడర్ లు ఇచ్చిండని, తొండలు చూసి ఏమన్నా బుల్లెట్ ట్రైన్ అనుకున్నావా రేవంత్ ? అని ఎద్దేవ చేశారు. ఎమ్మెల్యే అడ్డం పడడం వల్ల కేంద్రీయ విద్యాలయం ఒక ఏడాది విద్యా సంవత్సరం వెనకబడి పోయిందని, ఎమ్మెల్యే వి చాలా స్కామ్ లు ఉన్నాయని, ఒక్కొక్కటి బయట పెడతానంటూ హెచ్చరించారు. రాజకీయము ఇవాళ చూస్తావ్, రాజకీయం బారాబార్ చేస్తాం, సొల్లు పురాణం మాట్లాడుడు బంద్ చెయ్ ఎమ్మెల్యే సంజయ్ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి నియర్ కార్గి ఇంచార్జ్ భోగ శ్రావణి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మళ్లీ యుద్ధం..

**తుఫానుకు ముందు ప్రశాంతత! - ఇరాన్ పై భారీ దాడులకు ట్రంప్ ప్లాన్ ఇదే**
**ఏఐ ఫొటోతో ట్రంప్ హెచ్చరిక**




**ముద్ర డెస్క్ :** ఇరాన్‌పై మళ్లీ వైమానిక దాడులను ప్రారంభించడం గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఏఐ ఫొటోతో ట్రంప్ హింట్ ఇచ్చారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం ఎలాంటి సైనిక చర్య లేకుండా నిశ్శబ్దంగా ఉండటాన్ని 'తుఫానుకు ముందు ప్రశాంతత' అని పిలుస్తూ ఆయన ఒక పరోక్ష హెచ్చరిక జారీ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా క్రియేట్ చేసిన ఫొటోను ట్రంప్ ఈ మేరకు శనివారం తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫొటోలో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' టోపీ ధరించి, చూపుడు వేలితో హెచ్చరిస్తున్నట్టు కనిపించగా, అమెరికా నౌకాదళ అడ్మిరల్ ఆయన పక్కన నిలబడి ఉన్నారు. ఆ చిత్రంలో వారిద్దరూ అమెరికా నౌకపై ఉండి, వెనుక భాగంలో ఇరాన్ నౌకలు ఉన్నట్లు చూపించారు. దౌత్యపరమైన ప్రతిష్టంభనను సైనిక బలంతో బద్దలు కొట్టాలని ట్రంప్ నిర్ణయించుకుంటే, వైమానిక దాడులను పునఃప్రారంభించేందుకు అమెరికన్ మిలిటరీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ఇరాన్‌పై ట్రంప్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. శాంతి ఒప్పందం త్వరలో కుదరకపోతే ఇరాన్‌కు చాలా దారుణమైన పరిస్థితి ఉంటుందని కూడా ట్రంప్ ఇదివరకే హెచ్చరించడంతో ఈ ఫొటోతో ఆయన మళ్లీ యుద్ధం దిశగా హింట్ ఇచ్చారని భావిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 19-05-2026
www.mudranews.in | @mudranews



**ఆధునిక ఆలోచనా విధానం**

'జెన్ ఆల్ఫా డికోడెడ్' నివేదిక ప్రకారం ఈ తరం పిల్లలు కేవలం సాంకేతికతలోనే కాదు, ప్రాక్టికల్ ఆలోచనల్లోనూ ఎంతో ముందున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరి జీవన విధానం చాలా భిన్నంగా ఉంటోంది.

## అంకితభావంతో పనిచేయాలి

### –ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించబడిన ఎస్సైలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో తెల్కపల్లి ఎస్సై రమేష్, వంగూరు ఎస్సై మాధవరెడ్డి, ఉప్పునుంతల ఎస్సై మహేష్, బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్, తిమ్మాజీపేట ఎస్సై శ్రీనివాసరావులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు. నిజాయితీతో విధులు నిర్వహిస్తూ బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని నూతన సబ్ ఇన్‌స్పెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా..




**ముద్ర, కాప్రా:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైనిక్‌పూరిలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆశా వర్కర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు తమ సమస్యలు, విధుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం



**ముద్ర, మల్కాజిగిరి:** మణికొండలోని ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో సోమవారం నవసేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో టిఎక్స్ హాస్పిటల్స్ వైద్య బృందం పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మణికొండ మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ప్రారంభించారు. శిబిరంలో దంత వైద్య నిపుణుడు డాక్టర్ కొండపల్లి చైతన్య నేతృత్వంలో బీపీ, షుగర్, ఈసీజీ పాటు నేత్ర, దంత, చర్మ, జుట్టుకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. యువత రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంప్లాయిస్ కాలనీ, హుడా కాలనీ, చైతన్య కాలనీ ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో నవసేవా సంకల్ప ట్రస్ట్ చైర్మన్ మణి, ప్రధాన కార్యదర్శి మహేష్, అధ్యక్షుడు మొహమ్మద్ అజార్, సీనియర్ జర్నలిస్ట్ తిప్పరాజు రమేష్ బాబు, ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచార్యులు, మాజీ అధ్యక్షుడు పెంటా రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై వాటర్ వర్క్స్ ఈడీకి వినతి



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి హెచ్ ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. బీరప్పగడ్డ, చిలకనగర్, ఉప్పల్ ఓల్డ్ విలేజ్, కురుమనగర్, నగర్, రామంతాపూర్ బాగాయత్ ప్రాంతాల్లో నీటి సరఫరా, కలుషిత నీరు, కొత్త పైప్‌లైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని పరమేశ్వర్ రెడ్డి కోరారు. టెండర్ పూర్తైన పనులను వేగవంతం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.

## రేపు మెడికల్ షాపుల బంద్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈనెల 20న బుధవారం జిల్లా వ్యాప్తంగా మెడికల్ దుకాణాల బంద్ నిర్వహించనున్నట్లు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట సాయిబాబా తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా కార్యదర్శి వీరబొమ్మ సురేష్, కోశాధికారి వేములవాడ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు మాచి పెద్ద శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు ప్రధాన డిమాండ్లతో ఈ బంద్ చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని, జీఎస్ఆర్ 817 (28-08-2018)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డయాబెటిస్, బీపీ వంటి నిత్యావసర మందులను ఆన్‌లైన్‌లో విక్రయించడం వల్ల రోగులకు నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా కార్పొరేట్ కంపెనీలు అందిస్తున్న భారీ డిస్కౌంట్లను నిలిపివేయాలని, వాటి కారణంగా చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని, జీఎస్ఆర్ 220 (26-03-2020)ను కూడా ఉపసంహరించుకోవాలని కోరారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగానే ఈ బంద్ నిర్వహిస్తున్నామని, అయితే ప్రజల అవసరాల కోసం కొన్ని అత్యవసర మెడికల్ షాపులు యథావిధిగా పనిచేస్తాయని సంఘం నాయకులు స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# యువత ఆరోగ్యమే సమాజ బలం

### - కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా యువజన క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్‌లో యోగా, "ఆరోగ్య తెలంగాణ" కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన "ఫిట్ అండ్ యాక్టివ్ 2కే రన్"ను కలెక్టర్ ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ క్రీడా మైదానం నుంచి కేసరి సముద్రం ట్యాంక్‌బండ్ వరకు జరిగిన రన్‌లో యువత, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ప్రతిరోజూ వ్యాయామం, యోగా, నడక వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అనంతరం నిర్వహించిన యోగా కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్డీవో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమలలో విజయవంతంగా మాక్ డ్రిల్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై జిల్లా యంత్రాంగం సన్నద్ధతను పరీక్షించేందుకు నల్లమల్ల టైగర్ రిజర్వ్ పరిధిలో సోమవారం భారీ స్థాయి మాక్ డ్రిల్ నిర్వహించారు. రాసమల్లబావి, వట్టువర్లపల్లి, బ్రహ్మగిరి ప్రాంతాల్లో జరిగిన ఈ విన్యాసం విజయవంతమైంది. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అటవీ శాఖ, పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పాల్గొన్నాయి. అటవీ అగ్ని ప్రమాద పరిస్థితులను పోలి సన్నివేశాలు రూపొందించి స్పందనా సమయం, రక్షణ చర్యల అమలు సామర్థ్యాన్ని పరీక్షించారు.

డ్రోన్లు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, పోర్టబుల్ పంపులు వంటి ఆధునిక పరికరాలతో మంటలను అదుపు చేయడం, గ్రామస్థుల తరలింపు, అత్యవసర వైద్య సేవల నిర్వహణను ప్రదర్శించారు. వట్టువర్లపల్లి వద్ద రిలీఫ్ సెంటర్ ఏర్పాటు చేసి బాధితులకు సహాయక చర్యలు ఎలా అందించాలో వివరించారు.

అదేవిధంగా ఎన్ హెచ్–765పై ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వాహనాల రాకపోకల నిర్వహణను కూడా ప్రదర్శించారు. అటవీ సిబ్బంది భద్రత కోసం ఎల్ సీ ఈఎస్ విధానాన్ని అమలు చేశారు.

మాక్ డ్రిల్ అనంతరం కలెక్టర్ అన్ని శాఖల పనితీరును అభినందించి, భవిష్యత్తులో మరింత వేగవంతమైన స్పందన కోసం సమన్వయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల సమీప ప్రజలు, యాత్రికులు అగ్ని ప్రమాదాలకు దారితీసే చర్యలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అగ్నిమాపక శాఖ అధి కారి గిరిధర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అరుదైన పెల్విక్ ట్యూమర్‌కు శస్త్రచికిత్స

**ముద్ర, కాప్రా:** సైనిక్‌పురిలోని ప్యూర్ ఆర్తో హాస్పిటల్స్ వైద్యులు అరుదైన పెల్విక్ ట్యూమర్‌తో బాధపడుతున్న 32 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. దాదాపు 20×30 సెం.మీ పరిమాణంలో ఉన్న ఆస్టియోకాండ్రోమా కణితిని వైడ్ లోకల్ ఎక్సిషన్ విధానంలో తొలగించారు. డాక్టర్ వి.ఎస్. అభిలాష్ కుమార్ నేతృత్వంలో డాక్టర్లు ఉదయ్ శేఖర్ రెడ్డి, మనోజ్ పుడారి, సాయి కార్తికేయ బద్రి, సాయి కృష్ణ సి.ఎస్.ల బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. శస్త్ర చికిత్స అనంతరం రోగి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థులకు సహాయక కిట్ల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 81 మంది దివ్యాంగ విద్యార్థులకు 14 రకాల 108 సహాయక ఉపకరణాలు, కిట్లను పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, ట్రైసైకిళ్లు, వాకర్లు, విద్యా సామగ్రి తదితర ఉపకరణాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో సమాన హక్కులతో జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్య, ఉపాధి, వైద్య సేవలు, పునరావాసం వంటి రంగాల్లో ప్రత్యేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగ పిల్లలకు కూడా నాణ్యమైన విద్య, అవసరమైన సహాయక పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ "నా విద్య" కార్యక్రమం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక శిక్షణతో పాటు అవసరమైన ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, విలీన విద్య కోఆర్డినేటర్ వెంకటయ్య, వెంకటేశ్వర శెట్టి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వృద్ధుల వద్దకు వెళ్లిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మానవీయ స్పందనతో ఆకట్టుకున్నారు. అదనపు కలెక్టర్ పి. అమరేందర్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన కలెక్టర్, సమస్యలు చెప్పేందుకు వచ్చిన వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి వారి ఆవేదన విన్నారు. తమ పిల్లలు ఆస్తులు తీసుకుని ఇప్పుడు పట్టించుకోవడం లేదని వృద్ధులు వాపోవడంతో కలెక్టర్ ఓర్పుగా సమస్యలు తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ చూపిన ఆప్యాయత, స్పందన అక్కడున్న వారిని కదిలించింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా పరిశీలించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి సోమవారం జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులపై స్పష్టమైన రిమార్కులు నమోదు చేయాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్న కలెక్టర్, అందిన 35 దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కార వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వరుస చోరీల నిందితుడు అరెస్ట్



**నారాయణపేట, ముద్ర:** నారాయణపేట జిల్లా పరిధిలో పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన వరుస చోరీ కేసుల నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల నగదు, 2 తులాల బంగారం, 3 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తెలిపారు.

మరికల్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కర్రెం సూర్యనారాయణ మక్తల్, మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసు కొని విచారించగా నిందితుడు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. నిందితుడు బెట్టింగ్‌లకు బానిసై దుకాణాలు, వైన్ షాపుల్లో దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నాడని ఎస్పీ తెలిపారు. గత ఏడాది మే నెల నుంచి ఇప్పటి వరకు మొత్తం 10 చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వాటిలో 9 కేసులు మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో, మరో కేసు మరికల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైనట్లు చెప్పారు.

ఈ కేసు దర్యాప్తులో డీఎస్పీ మహేష్, మక్తల్ సీఐ కె. రాంలాల్, ఎస్ఐలు వై. భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం, విజయ్భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హిందూ సమ్మేళనం

**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈద మ్మ గుడి కాలనీలో సోమవారం నిర్వహిం చిన ఈదమ్మ గుడి బస్తి హిందూ సమ్మేళ నం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఓం భారత్ శక్తి పీఠం వ్యవస్థాపకులు గురూజీ భారత నంద మహారాజ్ ముఖ్య అతిథిగా, విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవా లను ఘనంగా నిర్వహించడం హిందూ ఐక్యతకు నిదర్శనమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని సూచించారు. దేశీయ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్స హించాలని, సమిష్టి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంద న్నారు. స్త్రీ శక్తిని మరింత అభివృద్ధి చేయా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాల నీలోని చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శన లతో ఆకట్టుకోగా, అనంతరం పాల్గొన్న వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. సమ్మేళన కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి భాను ప్రకాష్ రావు, కార్యదర్శి గుళ్ళ రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు తిమ్మాజి పేట పాండు, కొత్త గంగాధర్, ముమ్మడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వేలాదిగా హిందువులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



**చిన్న వయసులోనే ఆర్థిక స్పృహ:**



ఈ తరం పిల్లల్లో ప్రతి 10 మందిలో ఏడు గురు (70%) చిన్న వయసు నుంచే డబ్బు సంపా దించ దంపై ఆసక్తిని ప్రదర్శిస్తు న్నారు. ఆర్థిక విష యాల పట్ల వీరికి ఉన్న అవగాహన భవిష్య త్తులో వీరిని మంచి వ్యవస్థాపకులుగా మార్చగలదు.

# గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి కృషి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:** గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధించి ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యాలు మెరుగు పరుస్తామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మంత్రి పెగడపల్లి నుండి ఏడు మోటల పల్లె తండ వరకు రెండు కిలో మీటర్ల మేర రూ.2కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని తండాల మీదుగా ప్రధాన రోడ్లకు అనుసంధానం చేస్తూ లింకు రోడ్లు నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని తండాల మీదుగా రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెగడపల్లి నుండి ఏడు మోటలపల్లి తండా రోడ్డు నిర్మాణానికి స్థానిక రైతులు సహకరించాలని కోరారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు.

మండలంలోని కీచులాటపల్లి లో మంత్రి కూరగాయలు కొనుగోలు చేశారు. ధర్మారం, పెగడపల్లి మండలాల్లో సోమవారం పర్యటించిన మంత్రి కీచులాటపల్లిలో కూరగాయలు కొనుగోలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి తన వద్ద కూరగాయలు కొనుగోలు చేయడంతో సదరు మహిళా వ్యాపారి సంతోషం వ్యక్తం చేసింది.

# బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్

**- ప్రతి నెల సంక్షేమ వసతి గృహాలకు నిధులు విడుదల చేస్తున్నాం**

**- మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి సన్మాన సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:** బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ చైర్మన్ గా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కరీంనగర్ వచ్చిన సందర్భంగా కరీంనగర్ లోని ఇందిరా భవన్ లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని పోయే పార్టీ కాంగ్రెస్ అన్నారు. మంత్రి వర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా మంత్రులను నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీసీలకు దేశంలో ఎక్కడా లేని విధంగా 42 శాతం రిజర్వేషన్లు బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినట్లు గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ వసతి గృహాల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతినెల రూ. 220కోట్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు

బలహీన వర్గాల నేతగా బొమ్మ వెంకన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఆయన వారసునిగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి రాజకీయాల్లోకి వచ్చి ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని చెప్పారు. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి రానున్న రోజుల్లో మరిన్ని మంచి పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, సూడా చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలి

**- కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**- ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన "ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన జీవనం కోసం యోగా, వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఈఓ భోజన్న, సీపీఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ ధర్నా

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి**

**- మాజీ మేయర్ రవీందర్ సింగ్**




**ముద్ర, కరీంనగర్:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ ఆందోళనలో కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు. ఉదయం నుంచే తెలంగాణ చౌక్ వద్దకు కార్యకర్తలు, యువకులు భారీగా తరలివచ్చారు. "బాధితురాలికి న్యాయం చేయాలి", "చట్టం ముందు అందరూ సమానమే", "పదవి అడ్డం పెట్టుకొని తప్పించుకోలేరు", "నిష్పాక్షిక దర్యాప్తు జరగాలి" అంటూ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది.

**న్యాయం కోసం పోరాటం ఆగదు..**

ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావన్నారు. కానీ ప్రజల విశ్వాసం, గౌరవం ఎంతో గొప్పవన్నారు. బాలికకు సంబంధించిన ఇంత తీవ్రమైన కేసులో దేశ హోంశాఖకు చెందిన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తి పేరు చర్చకు రావడం బాధాకరమని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలంటే వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి లేదా కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. అధికారం ఉందని ఎవరూ చట్టానికి అతీతులు కాలేరన్నారు. సాధారణ వ్యక్తికి ఒక న్యాయం, అధికారంలో ఉన్న వారికి మరో న్యాయం అనే పరిస్థితి రావొద్దన్నారు. ధర్నాలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

# ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్ ఆర్ విద్యార్థుల హవా




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని ఎస్ ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయదుందుభి మోగించారు. కళాశాలకు చెందిన జె. శ్వేత రాష్ట్ర స్థాయి 351వ ర్యాంక్ సాధించింది. అలాగే కె. దియాశ్రీ 5,826, కె .సాహితి 7,637, శ్రీహర్ష 11,053, కె. సంకీర్తన 11,609, కె.అఖిల 12,806, బి .చంద్రకళ 13,591, లక్ష్మీప్రసన్నకు 15,824 ర్యాంకులు వచ్చాయి. తొమ్మది మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల డీజీఎం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లోనే కాకుండా, ఎప్‌సెట్ ఫలితాల్లో కూడా నిర్మల్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ విద్యాసంస్థల జోనల్ ఇంచార్జి నగేష్ యాదవ్, కళాశాల డీన్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మారథాన్ తో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుంది

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** మారథాన్ తో ప్రజల్లో ఆరోగ్య చైతన్యం, క్రమ శిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 5కే మారథాన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజా గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ మారథాన్‌లో యువత, విద్యార్థులు, క్రీడాకారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి రోజు యోగ సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ప్రతి మనిషి జీవితంలో యోగా, వాకింగ్, వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ముఖ్యమంత్రి గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ పోటీలు నిర్వహించారన్నారు. జిల్లా క్రీడల అధికారి రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలి



**బోథ్, ముద్ర:** యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచించారు. సోమవారం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన 5కే మారథాన్ రన్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేడ్కర్ చౌక్ మీదుగా తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు సాగింది. ఈ రన్ లో ఉద్యోగులు, యువత, వివిధ వర్గాల వారు, పట్టణ ప్రముఖులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 5కే రన్ లో గెలిచినవారికి మెడల్స్, ప్రశంస పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, డిఆర్డీ రాథోడ్ రవీందర్, డీపీఓ రమేష్, సంక్షేమ అధికారి మిల్కా, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, కోచ్ లు, అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా ఏక కాలంలో నాకాబంది



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సోమవారం నాకాబంది నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన పత్రాలు, లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నవారికి చలానాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా 156 స్పాట్ చలానా కేసులు నమోదయ్యాయి. 228 వాహనాలకు రూ.57,090ల జరిమానా విధించారు. దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న 173 వాహనాల చలనాల మొత్తం రూ. 57,855 వసూలు చేశారు. 41 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, భైంసా పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే నష్ట నివారణ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రకృతి విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ), రాష్ట్ర ప్రభుత్వం సం యుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వంటి పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమన్నారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



**గ్యాడ్జెట్స్ మరియు ఇంటర్నెట్ పరిజ్ఞానం:** జెన్-ఆల్ఫా పిల్లలు పుట్టుకతోనే ఇంటర్నెట్ ప్రపంచాన్ని చూస్తూ పెరగడం వల్ల డిజిటల్ స్మార్ట్‌నెస్‌ను త్వరగా అందిపుచ్చుకున్నారు. కేవలం వినోదం కోసమే కాకుండా, విజ్ఞానం మరియు కెరీర్ కోసం కూడా వీరు గ్యాడ్జెట్లను వాడుతున్నారు.



## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలి

### పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు కు ఆత్మీయ సన్మానం



**ముద్ర, హుజుర్ నగర్:** అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం పట్టణంలో పెరిక కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన దొంగరి వెంకటేశ్వర్లు గారిని మున్సిపల్ కౌన్సిలర్ కోలా ఉదయభానుఉపేందర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో ప్రగతి పనులు పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో ఉత్తంకుమార్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడు ఎక్కడ ఎన్నడూ లేనివిధంగా పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నా ఘనత మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి గారికి దక్కిందన్నారు. సన్న బియ్యంతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండినాయన్నారు. ప్రతి పేద కుటుంబం సన్న బియ్యం తింటూ సంతోషంగా గడుపుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాథమిక ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె నాగేశ్వర్రావు, ధనుంజయ్, పోతుల జ్ఞానయ్య, పోటు ఉపేందర్, పాలడుగు రాజు, గొట్టముకుల రాములు, బండి భాస్కర్ గౌర్రె వీరబాబు, తుమ్మ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## మునగ టీ ని ప్రారంభించిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ మహిళలు తయారు చేసిన మునగ టీ ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ లు భాస్కర్ రావు, వెంకారెడ్డి తో కలిసి కలెక్టరేట్లో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన టీ ఉత్పత్తుల గురించి తెలుకొని ఇలాంటి కొత్త తరహా ఆలోచలనతో ముందుకి సాగుతూ వారి జీవన ప్రమాణాలని మెరుగుపర్చుకోవాలని దానికి ప్రభుత్వం తరుపున సహకారం కూడా ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, రమణా రెడ్డి, మాధవి, జిల్లా అధికారులు, ప్రాసెసింగ్ యూనిట్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## భువనగిరిలో 2కే రన్, యోగా




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యువజన క్రీడలు వారోత్సవాలు లో బాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మొదటి రోజు సోమవారం భువనగిరిలో 2కే రన్, యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ. శ్రీనివాస్, భువనగిరి ఎంపీడీఓ దినకర్, జిల్లా యువజన, క్రీడల అధికారి కే. ధనంజనేయులు, డీఐఈఓ సురేష్ రెడ్డి గ్రీన్ జెండా ఊపి ప్రారంభించారు. 2కే రన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి పోస్ట్ ఆఫీసు వరకు జరిగింది. జిల్లా యువజన క్రీడల అధికారి కే. ధనంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగం గా యువజన క్రీడల వారోత్సవాలు ఈ నెల 18 నుండి 23 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సి.ఇ.ఓ. శ్రీనివాస్, అథ్లెటిక్ అసోసెషన్ ప్రెసిడెంట్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, యువజన సంఘాల అధ్యక్షులు సరగడ కరుణ్, జూడో ఫర్వేజ్, కృష్ణ, రాధా, కుమార్, రమేష్, ఎం. రాజేందర్, జె.సందీప్, గోపాల్, క్రీడాకారులు, సిబ్బంది జానకి రాములు మురళి, రేఖ, జయ, రాజశేఖర్, రేణుక శ్రీనివాస్ పాల్గొన్నారు.అనంతరం కలెక్టరేట్లో టూరిజం గైడ్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏ.భాస్కర్ రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంక రెడ్డి ఆవిష్కరించారు.

## మిషన్ భగీరథ పైపులైను పనులు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని న్యూ రామ్ నగర్ లో నూతనంగా ఇండ్ల నిర్మాణం అయిన ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాల నుండి మిషన్ భగీరథ పైపు లైను లేదని గత వారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించగా పనులను సోమవారం మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్థానికులు చల్ల కిషోర్, పుల్ల శివ, భుషపక బిక్షపతి, జాలిగం శివ, శివతేజ, శ్రీనివాస్ చారి, దినేష్, సంతోష్ సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 51 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 32, హౌసింగ్ 5, జిల్లా సంక్షేమ శాఖ 3, మున్సిపాలిటీ 2, సర్వే ల్యాండ్ 2, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ , ఎక్సైజ్, ఇరిగేషన్, చేనేత జౌళి, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





### ప్రజావాణికి అధిక ప్రాధాన్యం

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 28 దరఖాస్తులు, డిఆర్డిఏ 14, డిడబ్ల్యుఓ 3, హౌసింగ్ 2, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ డీఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఇఓ అశోక్ , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## పెట్రో ధరల పెంపుపై వినూత్న నిరసన

### సైకిల్ ఎక్కిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే
### 27 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర



**ముద్ర, యాదగిరిగుట్ట :** రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సైకిల్ ఎక్కారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సోమవారం ఉదయం 6 గంటలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాదాల వద్ద నుంచి కొలనుపాక సోమేశ్వర ఆలయం వరకు సుమారు 27 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర నిర్వహించారు.ఈ సైకిల్ యాత్రలో భాగంగా యాదగిరిపల్లి, వంగపల్లి, రామాజీపేట, పెద్ద కందుకూరు, చిన్న కందుకూరు, బాహుపేట, తదితర గ్రామాల మీదుగా ప్రయాణిస్తూ ఆలేరు మార్కెట్ యార్డు, కొలనుపాక సహా మొత్తం తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోలు పరిస్థితులు, రవాణా సమస్యలు, హమాలీల కొరత, లారీల అందుబాటు వంటి అంశాలపై ఆరా తీశారు.కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపులో జాప్యం ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే తొమ్మిది కొనుగోలు కేంద్రాలకు లారీలు సమకూర్చి ధాన్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు..అలాగే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా వచ్చే నెల రోజుల పాటు ఆలేరు నియోజకవర్గ పర్యటనల్లో అధికార వాహనం, ఎస్కార్ట్ వాహనాలను వినియోగించకుండా కేవలం ఎలక్ట్రిక్ స్కూటీల ద్వారానే ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 20న మెడికల్ షాపుల బంద్

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్ కు పిలుపునివ్వగా, సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒకరోజు మెడికల్ షాపులను బంద్ చేయనున్నట్లు సూర్యాపేట జిల్లా, పట్టణ, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, ఎస్పీ కె నరసింహ, జిల్లా డ్రగ్ ఇన్స్ పెక్టర్ తో పాటు జిల్లా అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అక్రమ ఈ ఫార్మసీలు వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదము ఉందని తెలిపారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జీఎస్ఆర్ 220 ఈను వెంటనే ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్మసీలకు సంబంధించిన జి.ఎస్.ఆర్ 817 ఈ నోటిఫికేషన్ ను రద్దు చేయాలని కోరారు. అలాగే కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న కెమిస్ట్ లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక వ్యాపార సమస్యగా చూడవద్దు అని ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించినదని గుర్తించాలని కోరారు. కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న, మధ్యతరగతి



కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా వ్యాపారాల మీద ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఆన్లైన్ వ్యవస్థను నిర్మూలించాలని కోరారు. బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యాపేటలో బొడ్రాయి బజార్ లో శ్రీ వినాయక మెడికల్ షాపు , పీఎస్ఆర్ సెంటర్ లో వేదశ్రీ మెడికల్ షాపు, ఎంజి రోడ్ లో కార్తికేయ మెడికల్ షాపు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ఒక్కరోజు బంద్ కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యామ ప్రభాకర్, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముశం హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపగాని గిరి గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా శ్రీనివాస్, కోశాధికారి చందన లింగయ్య, ఫార్మాసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ కోశాధికారి కర్నాటి వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ

### జిల్లా ఎస్పి నరసింహ

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పి నరసింహ తెలిపారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత



పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

## వాహనదారులు సీటు బెల్టు ధరించాలి

### ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ

**ముద్ర, యాదగిరిగుట్ట :** వాహనదారులు తప్పకుండ సీటు బెల్టు ధరించాలని యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ సీఐ యలగొండ కృష్ణ అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీటు బెల్ట్ దాని ఉపయోగాలు వాహనదారులకు తెలిపారు. సీట్ బెల్ట్ పెట్టుకున్నట్లయితే ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్ బ్యాగ్ ఓపెన్ అవుతుందని ఫలితంగా ప్రమాద తీవ్రత నుండి బయటపడవచ్చని చెప్పారు. లక్షలు పెట్టి కార్లు కొన్న సీటు బెల్టు ఉపయోగించుకుంటే ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వాహనంలో ఉన్న



ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. ఎవరైతే సీటు బెల్టు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్నారో వారికి జరిమానా కూడా విధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్ , కానిస్టేబుళ్లు సలీం, హనుమంతు, వెన్నెల, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సహృదయ వయోవృద్ధుల ఆశ్రమం సందర్శన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి మాధవి లత రాయగిరిలోని సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సోమవారం సందర్శించారు.ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధులను ముఖాముఖి జరిపి ఆశ్రమంలో వారికి కల్పిస్తున్న వసతుల గురించి సమీక్షించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వయోవృద్ధులకు ఆశ్రమము ముందు స్థలంలో సరైన నీడక్షి షెడ్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం భువనగిరిలోని గ్రేస్ బాలల హోం ను సందర్శించి, ఈ వేసవి సెలవులలో బాలలకు వివిధ స్కిల్స్ లలో శిక్షణ ఇప్పించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## 31న పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష ఎన్నికలు

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ఈ నెల 31న జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 17న వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలకు నామినేషన్లను స్వీకరించినట్లు తెలిపారు.మొత్తం 11 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు చెప్పారు.సోమవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు.దీంతో మిగిలిన ఆరుగురు



అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. బేలిదే శ్రీనివాసులు, బిక్కుమళ్ల ఉపేందర్, కలకోట లక్ష్మయ్య, కుక్కడపు శ్రీనివాసరావు, మీలా వంశీ, మిట్టపల్లి రమేష్ పోటీలో ఉన్నట్లు తెలిపారు.ఈ నెల 31న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ,ఓటు వేసే వారు తమ వెంట ఆధార్ కార్డును తీసుకురావాలని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 19.05.2026
www.mudranews.in | @mudranews



**కొనుగోళ్లపై బలమైన ముద్ర:**



ఇళ్లలో జరిగే రోజువారీ కొనుగోళ్లు మరియు నిర్ణయాలలో 66% ఈ పిల్లల ఇష్టాయిష్టాల వల్లే భావితమవుతు న్నాయి. వీరి అభిప్రాయాలకు తల్లిదండ్రులు సైతం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు.

# క్రీడాస్ఫూర్తి పెంపొందించటమే లక్ష్యం

**- ఆర్ట్ ఆఫ్ గివింగ్ తెలంగాణ కన్వీనర్ వినోద్ మోదాని**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించటమే లక్ష్యంగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేసినట్లు ఆర్ట్ ఆఫ్ గివింగ్ తెలంగాణ కన్వీనర్ వినోద్ మోదాని తెలిపారు. జిల్లా కేంద్రంలో గల జయశంకర్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీలో సోమవారం మహిళలు, పురుషులకు వాలీబాల్ కిట్లు, టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో కొంత భాగం సాయం చేస్తే ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. ఇతరులకు సేవా చేయాలనే ఉద్దేశ్యంతో ఆర్ధవ్ గివింగ్ సంస్థ పనిచేస్తుందన్నారు. పదిహేనేళ్ల క్రితం ప్రముఖ విద్యావేత్త అచ్యుత్ సామాంత ప్రారంభించగా నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. విశ్వశాంతికి, మానవీయ విలువల పరివ్యాప్తికి దాతృత్వ గుణపే మిన్న అనే సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ నెల11 నుండి 17 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్ట్ ఆఫ్ గివింగ్ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాల్లో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. సిద్ధిపేటలో ఆర్ట్స్ గివింగ్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యువతను సానుకూల దృకృతం వైపు నడిపించటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రస్తుతం సుమారు 200 పైగా దేశాల్లో తమ సంస్థ విస్తరించిందన్నారు. బాల్యంలో తాను అనుభవించిన పేదరి కం ఇతరులు అనుభవించవద్దని ఉద్దేశ్యంలో అచ్యుత సామంత కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ ప్రిన్సెన్ ద్వారా 40 వేల మంది గిరి జన విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ ఆఫ్ గివింగ్ ప్రతినిధులు వీరబత్తిని సత్యనారా యణ, ఆకుల పాండురంగం, పొద్దుటూరి సిద్దులు, బీఎల్ శ్రీనివాన్, రాజబహదూర్ రెడ్డి, నాయిని సంజీవ రెడ్డి, గ్యాదని కుమార్ పాల్గొన్నారు.

## టూరిజం క్లబ్స్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, యువ టూరిజం క్లబ్స్ కార్యచరణపై రూపొందించిన పోస్టర్ ను సోమవారం కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23 వరకు పర్యాటక వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, చారిత్రక వారసత్వం, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి చాటిచెప్పడం లక్ష్యమన్నారు. జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల వద్ద హెరిటేజ్ వాక్‌లు, స్వచ్ఛత కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహిస్తామన్నారు. పాఠశాలలో, కళాశాలలో పర్యాటక అవగాహన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధంగా యువ టూరిజం క్లబ్స్ ఏర్పాటు, పర్యాటక అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులను జూనియర్ టూరిజం అంబాసిడర్లుగా నామినేట్ చేసి వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డీఆర్డిఓ పీడీ శ్రీనివాస్ రావు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్ల పోచమ్మ జాతర



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మండలంలోని మక్తభూపతిపూర్ గ్రామంలో సోమవారం నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. అనంతరం నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతరలు ప్రతీకలన్నారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆమె వెంట మెదక్ జెడ్పీ మాజీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, బీఆర్ ఎస్ మెదక్ మండల అధ్యక్షుడు ఎం. అంజగౌడ్, నాయకులు కిష్టయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు సత్య గౌడ్, ఉప సర్పంచ్ బండమీది దుర్గయ్య, మాజీ సర్పంచ్ లు గట్టయ్య, అశోక్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, ముష్టి పెద్ద గంగయ్య, రాజల్ పేట గట్టయ్య, మంగలి ఆంజనేయులు, శాకానోళ్ల అంజయ్య, శ్రీధర్ రెడ్డి, మెదక్ మండల సోషల్ మీడియా ఇంచార్జి ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పీ చేతివాటం

**-రూ.1.40 లక్షలు స్వాహా చేసినట్లు మెప్మా పీడీకి ఫిర్యాదు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలో వార్డు నంబర్ 1, ఔరంగాబాద్ మహిళా సమాఖ్యకు చెందిన సభ్యు రాలు, రిసోర్స్ పర్సన్ అయిన చెప్యాల స్వాతి తమ గ్రూప్ నకు చెల్లించాల్సిన బ్యాంకు ఋణం డబ్బులను సొంతానికి వాడుకున్నట్లు సోమవారం మెప్మా పీడీకి అక్షయ గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. అనుమానంతో బ్యాంకు స్టేట్ మెంట్ తీయగా గ్రూపు సభ్యుల డబ్బులు రూ.1 లక్ష 40 వేల నగదును పూర్తిగా తన సొంత అవసరాలకు వాడుకొని తమను చీటింగ్ చేసినట్లు పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ చెప్యాల స్వాతిపై కేసు నమోదు చేయడంతో పాటు నగదు పూర్తిగా వసూలు చేసి విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

# రైస్ మిల్లర్లు సహకరించాలి

**- కలెక్టర్ హైమావతి**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** జిల్లాలోని రా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించి ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దించుకోవాలని కలెక్టర్ కె.హైమావతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని రా రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించి వారి మిల్లులలో ధాన్యం దించుకోవడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈసారి రబీ సీజన్లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం పండిందన్నారు. వాటిలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటికే లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేక రించామని చెప్పారు. మరొక 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. వాతావరణం అనుకూలించి అధికంగా ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. గ్రామాల వారీగా రైస్ మిల్లుల వారిగా ధాన్యాన్ని కేటాయిస్తామన్నారు. జిల్లాలోని రా రైస్ మిల్లర్లు వారి మిల్లులో 40 శాతం కెపాసిటీతో మొత్తం లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దించుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో జిల్లాలో అధిక శాతం సన్న రకం ధాన్యాన్ని రైతులతో పండించేందుకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు మోటివేట్ చేస్తున్నామన్నారు. మిల్లర్లు కూడా రైతులకు సన్న రకం ధాన్యాన్ని పండించడంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, రా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..**

## తిమ్మారెడ్డి గ్రామంలో మాక్ డ్రిల్



**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోకుండా వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మండల స్థాయి అధికార యంత్రాంగం, సిబ్బంది అప్రమత్తమై ఆపదలో చిక్కుకున్న వారికి సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టే విధానాన్ని అధికారులు వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరదల సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్షణ పద్ధతుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాబోయే వర్షకాలంలో చాలా జాగ్రత్తంగా ఉండాలన్నారు. వీరు సూచించిన పద్దతులు అవలంబిస్తే ఎలాంటి నష్టం జరుగదన్నారు. వీరు చెప్పిన విషయాలన్నింటిని తప్పకుండా పాటించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధికా రులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలుగొద్దు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం బీర్పూర్ మండలంలోని చర్లపల్లి, నరసింహుల పల్లి, కందెన కుంట, తుంగూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. డీఎస్ ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ సుజాత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రానున్న బక్రీద్ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం బక్రీద్ పండుగ ఏర్పాట్లపై ఎస్పీ జానకి షర్మిల తో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయప మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల వద్ద సౌకర్యాలు కల్పిం చాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మత పెద్దలు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే హరీష్ రావు క్యాంప్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రతి నెల 1న రూ.18 వేల ఫిక్సిడ్ వేతనం వచ్చే విధంగా చూడాలన్నారు. ఆశా వర్కర్లు ఇరువై ఏళ్ల నుండి పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారన్నారు. వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీసం ఫిక్సిడ్ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తే, గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు . అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని పొందుపరిచినదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా వేతనాలు పెంచలేదన్నారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు అమలు చేయట్లేదన్నారు. పీఆర్ సీ, ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై ఒత్తడి పెంచి తమ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షలు బాలమనణి, సహాయ కార్యదర్శి బిట్ల శ్రీలత, శోభ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని బొప్పాస్‌పల్లిలో సోమవారం గ్రామస్థులకు బాల్య వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ తులసి మాట్లాడుతూబాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ తులసి పేర్కొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com